క్లుప్తంగా

వడదెబ్బ బారిన పడొద్దు



మందులను పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా ఎక్కువ సార్లు తాగు నీరు, మజ్జిగ, నిమ్మరసం, సన్నారి, చెరుకురసం, తాటి ముంజలు, కొబ్బరినీళ్లు తీసుకోవాలని డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల (ఆయుష్) దత్తత గ్రామం పసుపులలో మన ఆరోగ్యం - గృహ వైద్యం, శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 52 మందిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఎలిజబెత్, కళావతి, ఆశావర్కర్లు తులశమ్మ, లక్ష్మీదేవి, ధనలక్ష్మి, ఆయుర్వే వైద్యశాల కాంపౌండర్ మంగమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



అమడగుంట్లలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు: పనివేళల్లో తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని గోరంట్ల, అమడగుంట్ల గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేసి రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవలపై చర్చించారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజకందించే సేవల్లో ఎలాంటి లోపాలుండరాదని, సకాలంలో సేవలందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా, ప్రజలకు సకాలంలో సేవలందించడంలో విఫలమైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

భోగేశ్వరుడి హుండీ కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలో గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వర స్వామి హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన కానులు, టికెట్లు, తాత్కాలిక దుకాణాల ద్వారా వచ్చిన డబ్బులను లెక్కించారు. మొత్తం రూ.2,98,362 నగదు సమకూరినట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. కానుకల లెక్కింపును సీఎఫ్ఓ వీరయ్య, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డిలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు సురేంద్రనాథ్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, సులోచన పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పల్లకీలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో నిర్వహించిన స్వాముల వారి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఉత్సవమూర్తులు వారి స్వస్థలమైన కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. వారం రోజుల పాటు భక్తులచే విశిష్ట పూజలు, అభిషేకార్చనలు అందుకుని ప్రభోత్సవం, రథోత్సవాల్లో విహరించారు. చివరి రోజు ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు లక్ష్మీనారాయణశర్మ విగ్రహాలను శుభ్రం చేసి, పల్లకీలో అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భాజాభజంత్రీల మధ్య పల్లకీని ఊరేగింపు నిర్వహించి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

గడివేముల: మండలంలోని అన్ని ఆర్బీకేల్లో జొన్న దిగుబడులను మద్దతుధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పెసరవాయి రైతుభరోసా కేంద్రంలో రైతులతో ఏఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జొన్నలకు క్వింటా రూ.2,970 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. ప్రతి రైతు 20 క్వింటాళ్ల నుంచి 100 కింటాళ్ల వరకు విక్రయించుకోవచ్చన్నారు. సమావేశంలో వీఆర్ఓ హరీంద్ర, వీఏఏ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు భరోసా

- 9, 10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్
- యూనిసెఫ్ సౌజన్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



ఏపీ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన చార్ట్



కరిమద్దెల జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం శ్రీనివాసులు (ఫైల్)

గడివేముల: పదో తరగతి తరువాత సరైన కెరీర్ గైడెన్స్ లేక పలువురు విద్యార్థులు భవిష్యత్‌ను కోల్పోతున్నారు. ఇకపై అలా జరగకూడదనే ఉద్దేశంతో ప్రతి విద్యార్థి తన భవిష్యత్‌ను చక్కగా మలుచుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా 2022-23 విద్యాసంవత్సరం నుంచి కెరీర్ గైడెన్స్‌ను ప్రారంభించింది. యూనిసెఫ్ సౌజన్యంతో 9, 10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఇందు కోసం విద్యార్థులు ప్రత్యేకంగా కెరీర్ కృత్యపుస్తకం అందజేశారు. పది తరువాత ఇంటర్మీడియెట్ కీలకం. అందుకోసం పదో తరగతి పూర్తయిన తరువాత ఏ కోర్సు ఎంపిక చేసుకోవాలో, భవిష్యత్‌ను ఏ విధంగా మలచుకోవాలనే అంశంపై అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కెరీర్ చార్ట్‌ను విడుదల చేసి ప్రతి పాఠశాలలో నోటీసు బోర్డులో విద్యార్థులకు కనబడేలా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది.

విద్యార్థుల ఆలోచనా శక్తి పెరుగుతుంది



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కెరీర్ గైడెన్స్ ద్వారా భవిష్యత్‌లో ఎలా ముందుకు వెళ్లాలో అంచనా వేసే శక్తి పెరుగుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం కెరీర్‌పై అవగాహన కల్పించడంతో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పదవ తరగతి పూర్తయ్యాక విద్యార్థులకు ఏ కోర్సు తీసుకుంటే మంచిదని విషయాన్ని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. – ఉపేంద్ర, ఎకానమిక్స్, ఉపాధ్యాయుడు, ఏపీ మోడల్ స్కూల్

అవగాహన వచ్చింది



మా సీనియర్లు చాలా మంది పదో తరగతి తరువాత ఏమి చేయాలో తెలియక చదువును ముందుకు కొనసాగించలేకపోయారు. కెరీర్ గైడెన్స్ ద్వారా భవిష్యత్‌లో ఏమి చేయాలో తెలుసుకున్నాను. ఏ గ్రూపు తీసుకుంటే అవకాశాలు ఎలా ఉంటాయో అవగాహన వచ్చింది.
– నస్రీమ్, పదోతరగతి విద్యార్థిని, ఏపీ మోడల్ స్కూల్

విద్యార్థులకు ఉపయోగం



పాఠశాల విద్య పూర్తయ్యాక విద్యార్థులు ఏ విధంగా ముందుకు వెళ్లాలనే విషయమై అయోమంగా ఉండేది. కెరీర్ గైడెన్స్‌పై విద్యాశాఖ కల్పిస్తున్న శిక్షణ ద్వారా విద్యార్థులకు పూర్తి అవగాహన కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వమే శిక్షణ ఇవ్వడం సంతోషం.
– శైలజ, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, గడివేముల

విద్యార్థులు లక్ష్యాన్ని సాధించేందుకు..

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో రిసోర్స్ పర్సన్ పర్యవేక్షణలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు వారి అభిలాశ, లక్ష్యం, ఇష్టాలను ప్రాతిపదికగా తీసుకుని కోర్సులను ఎంపిక చేసుకునే విధంగా శిక్షణ ఇస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కోడుమూరు రూరల్: మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని ఎంఈఓ అనంతయ్య వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. బుధవారం స్థానిక ఉర్దూ హైస్కూల్‌ను ఎంఈఓ తనిఖీ చేసి, రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని ప్రతి రోజు నాణ్యతగా వండి పెట్టేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అలాగే విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలన్నారు.

కొనసాగుతున్న భూముల రీసర్వే

కర్నూలు (న్యూటౌన్): మండలంలో భూముల రీసర్వే కొనసాగుతోందని రూరల్ మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం నాటికి మండలంలో 21 రెవెన్యూ గ్రామాల పరిధిలో 67,023.22 ఎకరాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు.

క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ

కర్నూలు (న్యూటౌన్): మచిలీపట్నంలో జరగబోయే ఎస్‌జీఎఫ్ అండర్ -14 క్రికెట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు బుధవారం టీ షర్టులను పంపిణీ చేశారు. గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామచంద్రుడు, వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, సుబ్రమణ్యం, శేఖర్ పాల్గొన్నారు.



ఆలయం వద్ద భక్తుల కోలాహలం

ఘనంగా మారెమ్మ దేవర

కోడుమూరు రూరల్: మండలంలోని కల్లపరి గ్రామంలో వెలసిన మారెమ్మ దేవర ఉత్సవాలను బుధవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. దేవర ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తులు శ్రీమారెమ్మకు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, నైవేద్యాలను సమర్పించి తమ తమ మొక్కుబడులను భారీగా చెల్లించుకున్నారు. ఐదేళ్ల తర్వాత దేవర ఉత్సవాలు జరుగుతుండడంతో గ్రామంలోని ఏ ఇంట చూసినా వచ్చివెళ్లే అతిథులు, బంధువులతో కళకళలాడుతూ పండుగ వాతావరణం నెలకొంది.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ అడిషినల్ డీపీఎం సలాం అన్నారు. బుధవారం పాణ్యంలో నవధాన్యాల సాగు, పొదుపు సంఘాల సభ్యులు, రైతుల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో 30 రకాల విత్తనాలతో 45 రోజుల పాటు పంటు అగు చేయడం వల్ల భూమిలోని వేర్ల వ్యవస్థ ద్వారా భూసారం, నత్రజని శాతం పెరుగుతుందన్నారు. ఫలితంగా అధిక దిగుబడులు సాధ్యమన్నారు. ఈ విషయాన్ని పొదుపు సంఘాల ద్వారా ఇంటింటికి వెళ్లి రైతులకు తెలియజేశామన్నారు. ర్యాలీ అనంతరం పొదుపు కార్యాలయంలో ఏపీఎం ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



మందిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: క్రీస్తు మార్గం అనుసరణీయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 38వ వార్డు రాజీవ్ గృహకల్ప కాలనీలో (సీసీ చర్చ్ అనుబంధ సంఘం) కోల్స్ తెలుగు బాప్టిస్ట్ నూతన ప్రార్థన మందిరం ప్రతిష్ఠ కార్యక్రమం కాటసాని పాల్గొన్నారు. రిబ్బన్ కట్ చేసి నూతన మందిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి, పాస్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న బెల్లం మహేశ్వర్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు బెల్లం మహేశ్వర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం గార్గేయపురం రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన రైతులతో కాసేపు సమావేశమయ్యారు. రైతుల పంట ఉత్పత్తులను రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల్లో అందుతున్న సేవలు, సాగు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సబ్సిడీతో టార్పాలిన్లు, వ్యవసాయ పనిముట్లు, స్ప్రేయర్లు అందించాలని రైతులు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో ఏఓ విశ్వనాథ్ పాల్గొన్నారు.

క్రైంకార్నర్

మైనర్ డ్రైవింగ్‌పై ‘స్పెషల్ డ్రైవ్’



మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

కర్నూలు: రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూలు నగరంలో బుధవారం ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాజ్‌విహార్ సెంటర్ ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న 22 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులను నమోదు చేసి రూ.33,770 జరిమానా విధించారు. అనంతరం వారితో పాటు తల్లిదండ్రులను కొత్తపేట దగ్గర ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ దగ్గరకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు ఇకపై వాహనాలు అప్పగించమని తల్లిదండ్రుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

కృష్ణానగర్‌లో చోరీ

కర్నూలు: కృష్ణానగర్‌లో చికెన్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఖలీల్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ యన బుధవారపేటలో నివాసముంటాడు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి చికెన్ దుకా ణానికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఇంట్లోనే నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రూ.50 వేలు నగదు, నా లుగున్నర తులాల బంగారు నగలు, 30 తులాల వెండి తస్కరించినట్లు బాధితుడు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పాత నేరస్తులు బైండోవర్

కర్నూలు: కర్నూలు పాతబస్తీలోని బాపూజీ నగర్‌కు చెందిన (పెద్ద పార్కు దగ్గర) ఇద్దరు పాత నేరస్తులు మున్నంగి కోటయ్య, గటిక సాయిచంద్‌లను మూడవ పట్టణ పోలీసులు బైండోవర్ చేశారు. వీరిపై గతంలో గంజాయి కేసులు ఉన్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా మళ్లీ గంజాయి వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం అందడంతో ఇరువురిని బుధవారం అదుపులోకి తీసుకుని కర్నూలు తహసీల్దార్ శివరాముడు ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

శనగ రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: పప్పు శనగ సాగు చేసిన రైతుల నుంచి ప్రభుత్వం క్వింటాల్ శనగలు రూ.5,340ల ప్రకారం కొనుగోలు చేస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. బుధవారం ఏఓ రవిప్రకాష్ మండలంలోని అమడగుంట్ల రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించడంతో పాటు శనగ రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. శనగ సాగు చేసిన రైతులంతా మార్కెట్‌లో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకు తమ దిగుబడులను అమ్ముకోవాలన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: ఈనెల 25న మండల సర్వ సభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీపీ రమణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

మురుగు కాలువలను ఆక్రమిస్తే చర్యలు

సి.బెళగల్: మురుగు కాలువలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈఓఆర్డీ నందీప్ హెచ్చరించారు. మురుగు కాలువల ఆక్రమణలపై స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సునీల్ రాజ్‌తో కలిసి పర్యటించారు. కొంతమంది మురుగు కాలువను ఆక్రమించుకున్నట్లు గుర్తించారు. గురువారం లోగా ఆక్రమణలను తొలగించకపోతే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల్లో ఇష్టారాజ్యం

- సీసీ కెమెరాలను ఏర్పాటు చేయని ప్రైవేటు కాలేజీలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో ప్రైవేటు కాలేజీల యజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బుధవారం నగరంలోని అయా పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పాటు సాంకేతిక సమస్యల సాకుతో లవ్‌స్ట్రీమ్ కూడా ఇవ్వలేదు. మొ దటి స్పెల్ ప్రధాన సబ్జెక్టులు పూర్తి కాగా, నేడు, రేపు బ్రిడ్జ్ కోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. మొదటి స్పెల్‌లో కెమెరాలు ఏర్పా టు చేయలేకపోయిన వారు ఈ నెల 26 నుంచి మొదలుకానున్న వొకేషనల్ రెండో స్పెల్ ప్రాక్టికల్ పరీక్షల నాటికైనా కెమెరాలతో పాటు లైవ్‌స్ట్రీమ్ ఏర్పాటు చేయాలని బోర్డు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. కాగా 31 కేంద్రాల్లో ఉదయం జరిగిన వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 1956 మంది విద్యార్థులకుగాను, 1797 మంది హాజరయ్యారు. 159 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల కు 1638 మందికిగాను, 1569 మంది హాజరై, 69 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి తెలిపారు.

వర్మీకంపోస్టు ఎరువులు పంటలకు ఉపయోగం



వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: రసాయన మందుల కంటే సాధారణంగా తయారు చేసిన వర్మీకంపోస్టు ఎరువులు పంటలకు ఎంతో ఉపయోగకరమని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం చిన్నటేకూరు గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ను ఆయన పరిశీలించారు. కేంద్రంలో తయారు చేస్తున్న వర్మీ కంపోస్టు గురించి రైతులకు వివరించారు. అనంతరం ఎరువును ఎలా తయారు చేయాలో వివరించి, దాని వల్ల పంటల్లో నాణ్యమైన అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. రైతులు ఎస్‌డబ్ల్యూపీసీలో తయారవుతున్న ఎరువును ఉపయోగించుకోవాలన్నారు. తక్కువ ధరకే రైతులకు ఈ ఎరువును ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.

లక్ష్యాలను చేరుకోవాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

ఓర్వకల్లు: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీఓ శివనాగప్రసాద్ సిబ్బందికి సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఎఫ్ఏలు, టీఏలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రోజు వారి లేబర్ బడ్జెట్ 4,340 మంది కూలీలకు పనులు కల్పించాలన్నారు. మార్చి 31 నాటికి మండలానికి ఇచ్చిన 5 లక్షల పని దినాలను పూర్తి చేయాలన్నారు.

‘శాంతిరాం’లో క్యాంపస్ సెలక్షన్స్



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ శెట్టి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఒమెగా హెల్త్‌కేర్ సంస్థ తమ కళాశాల ఫైనల్ ఇయర్ బి-ఫార్మసీ, డి ఫార్మసీ చదువుతున్న 55 మంది విద్యార్థులను ఎంపిక చేసుకుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ర్యాలీలో పాల్గొన్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్

గూడూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. పెంచికలపాడులో రైతులు, వ్యవసాయ సిబ్బంది, పొదుపు మహిళలతో కలిసి బుధవారం ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి పీఎండీఎస్, నవధాన్యాల సాగు, కిచెన్ గార్డెన్స్, సూర్య మండలం, విత్తన గుళికల తయారీ విధానం, బీజామృతం, విత్తన శుద్ధి విధానం, వాటి ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానం గురించి, 20 నుంచి 30 రకాల విత్తనాలను వాడకం వాటి ప్రయోజనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ మల్లికార్జున పాల్గొన్నారు.

సమయం వృథా చేసుకోవద్దు



విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

కల్లూరు: పరీక్షల సమయం సమీపిస్తున్నందున సమయం వృథా చేసుకోకుండా ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని డీఈఓ రంగారెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం రాత్రి నైట్ విజన్‌లో భాగంగా లక్ష్మీపురంలోని పదో తరగతి చదివే విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి రివిజన్ గురించి ఆరా తీశారు. విద్యార్థులతోనూ, వారి తల్లిదండ్రులతోనూ మాట్లాడారు. ఇంటి వద్ద కూడా సమయం కేటాయించుకుని చదువుకోవాలని సూచించారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మొబైల్ ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలని, చదువుకునే సమయంలో ఇబ్బంది లేని వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రంగమ్మ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

- జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు



జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కల్లూరు: జగనన్న కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పెద్దటేకూరు గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అప్రోచ్ రోడ్డు నిర్మించాలని లబ్ధిదారులు కలెక్టర్‌ను కోరగా.. సచివాలయ నిధులతో కాలనీలో అప్రోచ్ రోడ్డు నిర్మించే చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ సిబ్బందికి సూచించారు. కాలనీలో ఇళ్లు ప్రారంభించ వారిని గుర్తించి గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రమణమూర్తి, హౌసింగ్ ఏఈ రమణారెడ్డిలను ఆదేశించారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులు అందించాలి

చిన్నటేకూర్ సచివాలయాని కలెక్టర్ తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను అర్హులందరికీ అందించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలన్నారు. సచివాలయ సర్వీసుల ద్వారా వచ్చిన రుసుమును సంబంధిత ఖాతాలో జమ చేయాలని డిజిటల్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. గర్భిణులు, రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులు, వివరాలను అడిగి తెలుసుకున్నారు. డెలివరీ తేదీకి ముందే గర్భిణులు ఆస్పత్రిలో చేర్పించాలని ఆరోగ్య కార్యకర్తను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, హౌసింగ్ ఈఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిశోర్, ఎంపీటీసీ సభ్యుడు మునిస్వామి ఉన్నారు.